జలలం.. గరళం

- కృష్ణానదిలో కలుస్తున్న బూడిద నీరు
- డెల్టా ప్రాంతానికి పొంచి ఉన్న ముప్పు
- ఎన్టీటీపీఎస్ తీరుతో ప్రజలకు ప్రాణ సంకటం
- ఇప్పటికే గాలి, నీరు కలుషితం
- బూడిద కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నా మారని అధికారుల తీరు



ఇబ్రహీంపట్నంలో బుడమేరు ద్వారా కృష్ణానదిలోకి చేరుతున్న ఎన్టీటీపీఎస్ బూడిద నీరు



ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద నదిలో కలిసిన బూడిద నీటిని బాటిల్‌లో పట్టి చూపుతున్న జోగి రమేష్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ అధికారుల నిర్లక్ష్యం మైలవరం నియోజకవర్గ ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో వాయు కాలుష్యం నెలకొంది. తాజాగా బూడిద నీటిని సమీపంలోని కృష్ణానదిలోకి విడుదల చేయడంతో తాగునీటి కాలుష్యం ఏర్పడింది. నదిలో బూడిద నీరు కలవడంతో ఈ ప్రాంత ప్రజలతో పాటు కృష్ణా డెల్టాలోని అనేక గ్రామాల ప్రజలకు నీటి కాలుష్యం ఏర్పడి ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఇటీవలి కాలంలో బూడిద డంపింగ్, కాలుష్యంపై మాజీ మంత్రి జోగి రమేష్ పార్టీ శ్రేణులతో కలిసి పోరుబాట పట్టారు.

కృష్ణానదిలోకి బూడిద నీరు విడుదల

ఎన్టీటీపీఎస్ సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో సంస్థలోని బూడిద నీరు బుడమేరు డైవర్షన్ (బుడమేరు) కాలువ ద్వారా కృష్ణానదిలోకి విడుదల చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. బూడిద నీటితో నదిలో నీరంతా కలుషితమవుతోంది. కృష్ణానది జలాలను ఈ ప్రాంతంతో పాటు కృష్ణానది ఒడ్డున ఉన్న సీఎం చంద్రబాబు నివాసం, అమరావతి, విజయవాడ, మచిలీపట్నంతో పాటు కృష్ణాడెల్టాలోని అనేక గ్రామాల్లో కొన్ని లక్షల మంది తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. నదిలో బూడిద నీరు కలవడంతో గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోతోంది. కనీసం మంచినీరు తాగే పరిస్థితి లేకుండా పోయింది. ఎన్టీటీపీఎస్ సంస్థ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

కాలుష్యంపై వైఎస్సార్ సీపీ పోరుబాట

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఇప్పటికే బూడిద డంపింగ్ కేంద్రాలు, వాయు కాలుష్యంపై మాజీ మంత్రి జోగి రమేష్ పార్టీ శ్రేణులతో కలిసి పోరుబాట పట్టిన విషయం తెలిసిందే. ఈ పోరాటంతో ఇబ్రహీంపట్నం పోలీసులు మాజీ మంత్రి జోగి రమేష్‌తో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు. బూడదద కాలుష్యంపై నిరంతర పోరాటం సాగిస్తామని జోగి రమేష్ ఇప్పటికే ప్రకటించారు. పవిత్ర సంగమం వద్ద బూడిద నీటిని ఇటీవల ఆయన పరిశీలించారు. నీటిని చూపుతూ సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు తాగునీరు ఇవ్వలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఏపీ జెన్‌కో సంస్థ స్పందించి కాలుష్యంతో కిడ్నీ, ఊపిరితిత్తులు, చర్మ వ్యాధులు, గుండె జబ్బుల బారిన పడుతున్న పేదల ఆరోగ్యం కోసం సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను నిర్మించాలని, కాలుష్యం నివారణ చర్యలు చేపట్టాలని, విరిగిగా మొక్కలు పెంచాలని డిమాండ్ చేశారు.

బూడిద నీటితో మొరాయిస్తున్న ఫిల్టర్ బెడ్లు

బూడిద నీరు కృష్ణానదిలో కలవడంతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో ఫిల్టర్ బెడ్లు మొరాయిస్తున్నాయి. ఇటీవల మూడు రోజుల పాటు ఫిల్టర్ బెడ్లు మొరాయించడంతో మైలవరం నియోజకవర్గంలోని 104 గ్రామాలతో పాటు డెల్టా ప్రాంతంలోని అనేక గ్రామాలకు కృష్ణా జలాల సరఫరాకు అంతరాయం కలిగింది.

నిబంధనల మేరకే బూడిద నీరు విడుదల

బూడిద నీరు నేరుగా బుడమేరు చానల్ ద్వారా నదిలోకి కలవడం లేదు. ప్లాంటులో మిగులు నీరు మాత్రమే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలు, అనుమతుల మేరకే విడుదల చేస్తున్నాం. ప్లాంటు నుంచి వచ్చిన బూడిద నీటిని నేరుగా బూడిద చెరువులోకి మళ్లిస్తున్నాం.

– శివ రామాంజనేయులు, సీఈ ఎన్టీటీపీఎస్, ఇబ్రహీంపట్నం

త్వరితగతిన భూ సమస్యలకు పరిష్కారం

నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న



చాట్రాయి: భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అన్నారు. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో రీ-సర్వే లోపాలపై గురువారం నిర్వహించిన గ్రామ సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన రీ-సర్వేలో భూమి విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, 1-బి, అడంగల్, పాసుబుక్‌లో తప్పులపై రైతులు సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. ప్రతి సమస్యనూ క్షేత్రస్థాయిల్లో పరిశీలించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. నవంబర్ 10 లోగా భూ సమస్యలను పరిష్కరిస్తామని ఆమె రైతులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బద్రూ, సర్పంచ్ చల్లగుళ్ల వెంకటేశ్వరరావు, డీటీ ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మందులపై జీఎస్టీ తగ్గింపు

చాట్రాయి: వైద్యానికి అవసరమైన మందులు, వైద్య పరీక్షల్లో జీఎస్టీ తగ్గించారని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో జీఎస్టీ తగ్గింపుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రాణాంతకమైన వ్యాధులకు వినియోగించే మందులపై జీరో శాతం తగ్గించారని, సాధారణ మందులపై 12 నుంచి 5 శాతం వరకు తగ్గించారని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



మైలవరం: వెల్వడం గ్రామానికి చెందిన అగ్ని బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో గురువారం రూ. 37 వేల నగదు, 75 కిలోల బియ్యం అందజేశారు. పీఎంసీసీ ఎస్వీఎస్ నివృతరావు, జిల్లా గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు, జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ ఎస్‌వీఎస్ ప్రసాద్, సెకండ్ వైస్ గవర్నర్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, జీఎస్టీ కో-ఆర్డినేటర్ ముత్యం ప్రసాద్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్స్ వితరణ

తిరువూరు: గంపలగూడెం మండలం వినగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత రూ.10 వేల విలువైన టేబుల్స్‌ను గురువారం వితరణ ఇచ్చారు. గ్రామానికి చెందిన నాగళ్ల కనకరావు జ్ఞాపకార్థం ఆయన సోదరుడు రామకృష్ణ వీటిని అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికిరణ్, పూర్వ విద్యార్థి రాంప్రదీప్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జన విజ్ఞాన వేదిక కొండపల్లి శాఖ గౌరవాధ్యక్షుడు మామిడి సీతారామారావు అధ్యక్షతన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్లను కొండపల్లిలో గురువారం ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు వి.మురళీమోహన్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఈనెల 18న, మండల స్థాయిలో నవంబర్ 1న, జిల్లా స్థాయి పోటీలు నవంబర్ 23న, రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో జరుగుతాయని చెప్పారు. పూర్తి వివరాలకు జేవీవీ ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు, సెల్: 90004 27606 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

ఆగిరిపల్లి: శరీరానికి ఆరోగ్యం ఎంత అవసరమో మానసిక ప్రశాంతత కూడా అంతే అవసరమని మానసిక వైద్య నిపుణురాలు పేట సాయిప్రియ అన్నారు. అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ వారి లెక్కల ప్రకారం మానసిక రుగ్మతలు మహిళల్లోనే ఎక్కువగా ఉంటాయన్నారు. మహిళలకు మానసిక సమస్యలు ఉన్నప్పుడు మానసిక నిపుణుల సహాయం తీసుకోవాలని, కుటుంబ సభ్యులు ప్రేమ, ప్రోత్సాహం అందించాలని, ప్రభుత్వం కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

రోడ్లు నిర్మించాలని ఆందోళన



తిరువూరు: అధిక వర్షాల కారణంగా తిరువూరు నియోజకవర్గంలో ధ్వంసమైన రోడ్లను వెంటనే నిర్మించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు గురువారం తిరువూరు ఆర్ అండ్ బీ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. రహదారులు ఛిద్రమై, గోతులమయమై వర్షాకాలంలో ప్రమాదాలకు నెలవుగా మారాయని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గోతులు లేని రోడ్ల నిర్మాణం ఏమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తూము కృష్ణయ్య ప్రశ్నించారు. రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ అండ్ బీ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

పశువులకు ప్రాణాంతక ఎల్ఎస్‌డీ వ్యాధి



తిరువూరు: తిరువూరు పట్టణంలోని పశువులకు లంప్ స్కిన్ డిసీజ్ (ఎల్ఎస్‌డీ) వ్యాధి సోకడంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఆవులు, లేగదూడలకు, ఎద్దులకు శరీరమంతా పుండ్లు పడి రసి కారుతుండటంతో వాటి నుంచి ఇతర పశువులకు కూడా ఈ వ్యాధి వ్యాపిస్తోందని చెబుతున్నారు. తిరువూరు ప్రధాన వీధుల్లో ఈ వ్యాధి సోకిన పశువులు తిరుగుతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ వ్యాధి పాడి పశువులకు కూడా సోకే ప్రమాదం ఉందని, పశు వైద్యాధికారులు, నగర పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పశువుల యజమానులు కోరుతున్నారు.

దూరంగా ఉంచాలి..వ్యాక్సిన్ వేయించాలి

చర్మవ్యాధుల్లో అతి ప్రమాదకరమైన ఈ వ్యాధి సోకిన పశువులను బహిరంగ ప్రదేశాల్లో వదలకుండా ఇతర పశువులకు దూరంగా ఉంచాలని, కాకులు, ఇతర పక్షులు పశువుల పుండ్లను పొడవకుండా గుడ్డ చుట్టి ఉంచాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. తిరువూరు పశు వైద్యశాలలో ఈ వ్యాధి నివారణకు అవసరమైన వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, పశు యజమానులు తప్పక తమ పశువులకు ఎల్ఎస్‌డీ వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేయించాలని మండల పశు వైద్యాధికారి అభిలాష్ సూచించారు.

నిబద్ధతతో విధులు నిర్వహించాలి

విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాగమణి

తిరువూరు: డీఎస్సీలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు నిబద్ధతతో విధులు నిర్వహించాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి పేర్కొన్నారు. తిరువూరు వాహినీ కళాశాలలో 2025 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల్లో గురువారం ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ విషయ పరిజ్ఞానానికి సాంకేతికతను జోడించి విద్యార్థులకు సులభరీతిలో పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచేందుకు తగు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. కోర్సు డైరెక్టర్లు కేశవరావు, శ్యాంసుందరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయవృత్తికి వన్నె తేవాలి

నూతనంగా బాధ్యతలు చేపడుతున్న ఉపాధ్యాయులు ఆ వృత్తికి వన్నె తేవాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సూచించారు. తిరువూరు వాహినీ కళాశాలలో డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దాలని కోరారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

నూజివీడు సీఐ రామకృష్ణ హెచ్చరిక



ఫైర్ వర్క్స్ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

నూజివీడు: దీపావళి పండుగను పురస్కరించుకుని ఎవరైనా అక్రమంగా టపాసులు నిల్వ చేసినా, విక్రయాలు జరిపినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ హెచ్చరించారు. మండల పరిధి అన్నవరంలోని ప్రదీప్ ఫైర్ వర్క్స్ గోడౌన్‌ను గురువారం అగ్నిమాపక సిబ్బందితో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. బాణసంచా నిల్వ గోడౌన్‌ల వద్ద యజమానులు ఇసుక, నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని చెప్పారు. మైనర్లను బాణసంచా షాపుల్లో, గోడౌన్‌లలో, విక్రయాల వద్ద పనికి పెట్టుకోకూడదని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బాణసంచా విక్రేతలు జాగ్రత్తలు పాటించాలి

చాట్రాయి: టపాసుల విక్రయ కేంద్రాల వద్ద ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ పేర్కొన్నారు. బాణసంచా విక్రయదారులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళి సందర్భంగా టపాసులు అమ్మే ప్రదేశంలో ప్రమాదాలు జరుగకుండా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పండుగ నాడు టపాసులు కాల్చేవారు కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ప్రారంభం



నూజివీడులో పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు



కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న హెచ్ఎం హేమలత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమలత క్రీడాకారులతో కబడ్డీ ఆడి ప్రారంభించారు. మండల కో-ఆర్డినేటర్ టి.సురేంద్రబాబు ఆధ్వర్యంలో కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ తదితర క్రీడలు జరిగాయి. వివిధ పాఠశాల నుంచి సుమారుగా 300 మంది బాలికలు హాజరయ్యారు. ఎంఈఓ-2 పీవీ మాలిని, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలుర అథ్లెటిక్స్ పోటీల నిర్వహణ

నూజివీడు: కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నూజివీడు మండల బాలుర అథ్లెటిక్స్ పోటీలను పట్టణంలోని సెయింట్ థామస్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించారు. పోటీలను జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్ ఇన్‌చార్జి హెచ్‌ఎం డొక్కు శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. డిస్కస్ త్రో, 100, 200, 400, 800 మీటర్ల పరుగు పందెం, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో ఈవెంట్‌లలో పోటీలు నిర్వహించారు. నూజివీడు మండలం ఇన్‌చార్జి స్వప్న, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మేలు



జీఎస్టీ ర్యాలీలో పాల్గొన్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి: జీఎస్టీ తగ్గింపు ద్వారా ప్రజలకు డబ్బు ఆదా అవుతుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం ఆగిరిపల్లిలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం రెండు శ్లాబుల వరకే పరిమితం చేయడం వల్ల వినియోగదారులకు మరింత ఉపశమనం కలుగుతుందని వివరించారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ భార్గవి, వైద్యాధికారి జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపును వినియోగించుకోవాలి

ముసునూరు: వస్తు సేవల పన్నుల తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను పేద, మధ్య తరగతి ప్రజలు వినియోగించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి గంగాధర్ అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ వద్ద జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌ఎన్ బీఎల్ కుమారి, మెడికల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర విధులు బహిష్కరణ

విస్సన్నపేట: ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10వ తేదీ నుంచి పాఠశాలలో బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నామని విస్సన్నపేట ఫ్యాప్టో కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో టి. యాకోబు, బీసీహెచ్‌వీ సూర్యనారాయణ, ఎల్. అంకరాజు, ఎ. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- మైలవరం: బోధనేతర పనులను శుక్రవారం నుంచి బహిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకుడు ఎల్. సాయి శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ మేరకు ఎంఈఓ ఎల్ బాలుకు వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

జి.కొండూరు: విద్యార్థులు సెల్‌ఫోన్లు వినియోగించే సమయంలో సైబర్ క్రైమ్ బారిన పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ క్రైమ్ ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్టు, ఓటీపీలు, ఏపీకే ఫైల్స్ వంటి వాటి వల్ల కలిగే నష్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడితే ఇది వ్యసనంగా మారి ఆర్థికంగా, మానసికంగా తీవ్ర నష్టాలను చూడాల్సి వస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరం

విస్సన్నపేట: జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా స్థానిక వికాస్ టెక్నో స్కూల్‌లో ఈ నెల 13, 14వ తేదీలలో ఆధార్ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తామని గుడివాడ డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ ముత్యాల శ్రీనివాసు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరంలో ఆధార్ నమోదు, అప్డేట్ సేవలు అందిస్తామని చెప్పారు.

సారా విక్రేత అరెస్టు

ముసునూరు: సారా తయారు చేసి విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. లోపూడిలో బొర్రా ధనలక్ష్మి రహస్యంగా సారా విక్రయిస్తుండటంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ సిబ్బందితో కలిసి గురువారం తనిఖీలు నిర్వహించి ఒక లీటరు సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మహిళను రిమాండ్‌కు తరలించారు.

పీఎంజేజేబీవై చెక్కు అందజేత

చాట్రాయి: మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన షేక్ బాజీ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. పీఎంజేజేబీవై పథకం ద్వారా రూ.2 లక్షల చెక్కును ఇండియన్ బ్యాంకు మేనేజర్ ఎస్.హేమంత్, ఎస్ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు కె.గోపయ్య, పి.నవీన్‌ల చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు



తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల్లో గురువారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నిక్సన్, ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో పలు లైసెన్స్‌డ్ దుకాణాల్లో మద్యం నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వ మద్యం డిపోల నుంచి వచ్చిన స్టాకు, అమ్మకం వివరాలను తనిఖీ చేశారు. నకిలీ మద్యం అమ్మకాలు జరుగుతున్న నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు.

17న 'ఫ్రమ్ నూజివీడు ఉయ్ లీడ్'పై సమావేశం

నూజివీడు: 'ఫ్రమ్ నూజివీడు ఉయ్ లీడ్'పై సమావేశం ఈనెల 17న ఉదయం 10.30 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్, డిజిటల్ మీడియా, కంటెంట్ క్రియేషన్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్, వీడియో-ఫొటో డాక్యుమెంటేషన్ల ద్వారా, ప్రభుత్వంతో పాటు నూజివీడు అభివృద్ధిలో భాగస్వాములు కావచ్చని వివరించారు.

వరిలో ఎలుకల నిర్మూలన తప్పనిసరి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయకుమారి



కవులూరు గ్రామంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

జి.కొండూరు: వరిపైరులో ఎలుకల నిర్మూలన చర్యలు రైతులు చేపట్టాలని, లేకుంటే చిరుపొట్ట దశలో తీవ్ర నష్టాన్ని కలగజేస్తాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయకుమారి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని కవులూరు గ్రామంలో గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎలుకల నిర్మూలన మందును వందశాతం రాయితీపై రైతులకు అందజేస్తున్నామని చెప్పారు. ఈ మందును ఎకరానికి 4 గ్రాముల మందు, 4 గ్రాముల నూనె, 192 గ్రాముల నూకలు చొప్పున కలిపి పది గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి ఎలుకలు ఉన్న బొరియల్లో వేయాలని వివరించారు. మండల వ్యవసాయాధికారి సూరిబాబు, గుంటూరు వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయం నుంచి డీడీఏ శారద, ఏడీఏ అనిత భాను, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

- మైలవరం: పంట చేలల్లో రైతులందరూ సామూహిక ఎలుకల నిర్మూలన చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మైలవరం ఏడీ ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మైలవరం రైతు సేవా కేంద్రంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం గురువారం నిర్వహించి ఆయన పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయ శాఖాధికారి సంధ్యారాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: తెల్లదేవరపల్లి గ్రామంలో ఎలుకల నివారణ మందు వినియోగంపై రైతులకు ఏడీఏ కె. శశికళ గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలో రైతులు పాల్గొన్నారు.
- మునుకుళ్ల(తిరువూరు): మండలంలోని అన్ని గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం నిర్వహించాలని రైతులకు మండల వ్యవసాయాధికారి పద్మ సూచించారు. మునుకుళ్ల రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు పంట చేలల్లో ఎలుకల కారణంగా జరిగే నష్టాలు, వాటి నిర్మూలనకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు.

కుల దూషణపై ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న బాధితులు జరపల ఇందిర, ఆదిలక్ష్మి

ఇబ్రహీంపట్నం: కులం పేరుతో దూషించడమే కాకుండా ఓసీ ఏరియాలో ఉండవద్దని టీడీపీకి చెందిన కొందరు తమను బెదిరిస్తున్నారని బాధితులు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులైన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన తల్లీ కూతుళ్లు జరపల ఆదిలక్ష్మి, జరపల ఇందిర గురువారం మీడియాతో మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళుతున్న తమను తుళ్లూరు రాజ్యలక్ష్మి, పురుషోత్తం తదితరులు నిలిపి ఓసీ ఏరియాలో మీరు ఉండకూడదని, రోడ్డుపై తిరిగేందుకు వీలులేదని, ఇల్లు అమ్ముకుని ఎటైనా వెళ్లాలని, లేకుంటే మీఅంతు చూస్తామని బెదిరించారని వాపోయారు. గతంలో కూడా వీరు బెదిరించగా అప్పట్లో వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని, ఆ వ్యవహారం ఇంకా కోర్టులోనే ఉందన్నారు. మరలా రెచ్చగొట్టి గొడవ పెట్టుకుంటున్నారని చెప్పారు. మాకు న్యాయం చేయాలని కోరారు.

సుప్రీం సీజేపై దాడి అమానుషం

చాట్రాయి: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై చేసిన దాడి అమానుషమని సీపీఐ ఎంఎల్ జిల్లా కమిటీ సభ్యులు చాట్ల బాబూరావు అన్నారు. డిసెంబర్ 6, 7 తేదీలలో జరుగనున్న పార్టీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పోలవరం గ్రామంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని, ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కలపాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.